

దరఖాస్తుల ఆహ్వానం

జైనూర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంలొద్ది కేజీబీవీ విద్యాలయంలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేకఅధికారి సుమలత శనివారం తెలిపారు. సీఆర్టీ ఇంగ్లీష్ బోధన కోసం బీఈడీ, టెట్ పూర్తిచేసి ఉండాలన్నారు. అదేవిధంగా పీజీసీఆర్టీ ఇంగ్లీష్ బోధించు టకు బీఈడీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల19,20 తేదీల్లో కేజీబీవీ కార్యాల యంలో సమర్పించాలని ఆమె సూచించారు. జిల్లాకు చెందిన మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తాం

● అదనపు కలెక్టర్ దీపక్ తివారి



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని అదనపుకలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం మండలంలోని సాకడ, కెరమెరి, గోయగాం గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా సర్వే బృందాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అర్హులం దరికీ సంక్షేమపథకాలు వర్తింపజేస్తామని తెలిపారు. కెరమెరి మండ లంలో నిర్మించతలపెట్టిన సులబ్ కాంప్లెక్స్ స్థలాన్ని పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టాలని సూచించారు. అనంతరం గోయగాం జిల్లాపరిషత్ పాఠశాలను సందర్శించారు. అక్కడ నిర్మిస్తున్న వంటగది, ఇతర పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులను సమస్యలు అడిగితెలుసుకున్నారు. అదనపు మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నభోజనంలో మెనూ పాటిం చాలన్నారు. పరీక్షలకు పదవతరగతి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న తీరును అడిగితెలుసుకున్నారు. అనంతరం విద్యార్థు లకు స్వయంగా బోధించారు. ఆయనవెంట ఎంపీడీవో అంజద్‌పాషా, కార్యదర్శులు బొజ్జిరావు, గణేష్, ఈశ్వర్, ఉపాధ్యాయులు రమేష్, విష్ణుగౌడ్ తదితరులు ఉన్నారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్



తిర్యాణిలో సర్వేను పరిశీస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

తిర్యాణి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గిన్నెధరి గ్రామంలో కొనసాగుతున్న రైతుభరోసా, రేషన్‌కార్డుల సర్వేను అదనపు కలెక్టర్ డేవిడ్(రెవెన్యూ) శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులకు ప్రభుత్వపథకాలు చేరే విధంగా పకడ్బందీగా సర్వే చేపట్టాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమపథకాలు చేరిన ప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. ఆయనవెంట తహసీల్దార్ సూర్యప్రకాష్, ఏవోవినోద్, ఏఈవోలు శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

బడి మానేసిన పిల్లల కోసం ఇంటింటి సర్వే

వాంకిడి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సామెల గ్రామంలో శనివారం బడిబయట ఉన్న పిల్లల కోసం సర్వే చేసినట్లు సీఆర్పీ దుర్గం సందీప్ తెలిపారు. ఈ సందర్భంగా 6వ తరగతి చదివి బడిమానేసిన సెండె సాయినాథ్, ఆడె తిరుపతి అనే ఇద్దరు బడి బయట పిల్లలను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చి బడిలో చేరేలా అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. బడిమానేసిన, బడి బయట ఉన్న పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించేలా చూడాలని ఆయన కోరారు. గ్రామాల్లో ఎవరైన బడిబయట ఉన్న పిల్లలు ఉంటే 9666665253 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ఆసిఫాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు బండారు రవికుమార్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదలచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల25 నుంచి 28వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, దినకర్, శ్రీనివాస్, ఆనంద్, రాజేందర్, మాలశ్రీ, టీకానంద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): లింగాపూర్ మండలం మామిడిపల్లికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకలు, కార్యకర్తలు శనివారం ఆసఫాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

వెలవెలబోయిన వారసంత

సిర్పూర్(టి), జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలసర్వే నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన వారసంత వెలవెలబోయింది. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు, రైతుభరోసా పథకాల అమలుకు అధికారులు సర్వే నిర్వహి స్తుండడంతో గ్రామస్థులు అధికారులకు వివరాలు తెలిపేం దుకు ఇళ్ల వద్దే ఉన్నారు. దీంతో వారసంతలో ప్రజలు లేక వెలవెల బోయింది.

ప్రయోగం.. ఫలించేనా?



ఇంటర్ సైన్స్, మాథ్స్ విద్యార్థులకు ప్రయోగ పాఠాలు అత్యంత కీలకం. అలాంటిది సరైన సమయంలో నిధులు మంజూరు కాకపోవడంతో ప్రయోగ సామగ్రి లేక రెండేళ్లుగా విద్యార్థులు ప్రయోగాలు సరిగా చేయలేక పోయారు. డిసెంబరు చివరి వారంలో నిధులు విడుదల కావడంతో విద్యార్థులతో అధ్యాపకులు ఆదరబాదరగా ప్రయోగాలు చేయిస్తున్నారు. ఇలాంటి ప్రయోగ పాఠాలతో విద్యార్థులు ప్రయోగ పరీక్షల్లో ఏ మేరకు ఉత్తీర్ణత సాధిస్తారో...

- ఫిబ్రవరి 3నుంచి ప్రయోగ పరీక్షలు
- నిధుల విడుదలలో జాప్యం
- నామమాత్రంగా ప్రయోగ పాఠాలు
- ఫలితాలపై ప్రభావం పడే అవకాశం

బెజ్జూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రయోగాలు చేయకుండానే ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు వెళ్తున్నారు. కళాశాలల్లో ప్రయోగశాలలు లేకపోవడం, ఉన్నవాటిలో రసాయనాలు కొరతతో ఈ ఏడాది వారికి ప్రయోగాలు చేయించలేదు. ఫిబ్రవరి 3నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబరు చివరి వారంలో ఒక్కో కళాశాలకు రూ.25 వేల చొప్పున మంజూరు చేసింది. ఇప్పటి వరకు రసాయనాలు, పరికరాలు కొనుగోలు చేసి విద్యార్థులను సన్నద్ధం చేయడమనేది కష్టతరమే. తక్కువ సమయంలో ప్రయోగ పరీక్షలకు ఎలా సిద్ధం కావాలని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

● పరీక్షల ముందు నిధులు..

కళాశాలలకు నిధులు మంజూరులో జాప్యం జరిగింది. రెండేళ్లుగా విద్యార్థులు సక్రమంగా ప్రయోగాలు చేయలేకపోయారు. పరీక్షల ముందు వచ్చిన నిధులతో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ ఆదరబాదరగా రసాయనాలు, పరికరాలు సమకూర్చి విద్యార్థులను సిద్ధం చేసినా పూర్తిస్థాయిలో మార్కుల సాధనపై భరోసా లేదు. ప్రయోగ పరీక్షలపై శ్రద్ధ కనబర్చకపోవడంతో ఫలితాలు తగ్గే ప్రమాదం లేకపోలేదని విద్యార్థులు వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 11ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు సుమారు ఐదు వేలకు పైగా ఉన్నారు. ఆయా కళాశాలల్లో సరైన సమయంలో ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలో జాప్యం కారణంగా ప్రయోగ పాఠాలు పూర్తిస్థాయిలో జరగలేదు. దీంతో ఈ ఏడాది ఇంటర్ ఫలితాలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందనిపిస్తోంది.

● కస్తూర్బాల్లో పాఠశాలల నిర్వహణ నిధులతోనే..

జిల్లాలోని కొన్ని కస్తూర్బా పాఠశాలల్లో జూనియర్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలకు వచ్చే నిర్వహణ నిధులతోనే ప్రయోగశాలలకు కొంత మేరకు వెచ్చిస్తున్నారు. దీంతో పాఠశాలల నిర్వహణపై ప్రభావం పడింది. జూనియర్ కళాశాలలకు ప్రతి సంవత్సరం నిధులు కేటాయిస్తే ఫలితాల శాతం పెరిగే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కళాశాలలకు వచ్చే నిధులు విడుదల చేయడంలో ఏటా జాప్యం కారణంగా ఫలితాలు తగ్గుతూ వస్తున్నాయి. ఇకనైనా ప్రభుత్వం ప్రతి ఏటా నిధులు విడుదల చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ఉన్నవాటితోనే ప్రయోగాలు..

- కళ్యాణి, జిల్లా మాధ్యమిక విద్యాధికారి

జూనియర్ కళాశాలల్లో ఉన్న రసాయనాలతోనే ప్రయోగాలు నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది నిధులు మంజూరయ్యాయి. వాటితోనే రసాయనాలు, ఇతర పరికరాలు కొనుగోలు చేసి విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం. మెరుగైన ఫలితాలు వచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

అర్హులకు సంక్షేమ పథకాలు

అందేలా కృషి చేయాలి: కలెక్టర్



ఆసిఫాబాద్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పకడ్బందీగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని జుబ్లీ మార్కెట్ సమీపంలో రైతుభరోసా పథకంపై నిర్వహిస్తున్న వ్యవసాయ భూముల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయానికి యోగ్యమయ్యే భూములకు మాత్రమే రైతుభరోసా పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు. నాలా,ఇండ్లు, వెంచర్లు, ప్లాట్లుగా మార్చిన భూములను జాబితాలో తీసుకోవ ద్దన్నారు. అనంతరం జన్కాపూర్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే, ఏవో మిలింద్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలదే భవిష్యత్

● ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఆసిఫాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో రైతుల స్థితిగతులను తీర్చిదిద్దడంలో రైతు ఉత్పత్తి సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ట్రైకార్ మొదటిదశ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ట్రైకార్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లా జైనూరు, రెబ్బెన రైతుఉత్పత్తి సంఘాలకు మొదటిదశ రాయితీగా ఒక్కోరైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50లక్షల చొప్పున రూ.15లక్షలు విడుదలయ్యాయి. వాటికి సంబంధించిన చెక్కును పీవో అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యానవ అధికారి సందీప్‌కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టుమేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞాశీల్, బోర్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

కాగజ్‌నగర్‌లో ఎన్టీఆర్ వర్ధంతి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న గుళ్లపల్లి ఆనంద్

కాగజ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చౌక్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్ గుళ్లపల్లి ఆనంద్ పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రూ.2కిలో బియ్యం ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలోనాయకులు ఎల్ మధుకర్, చల్లూరి శంకర్, వైశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

తిర్యాణి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండల ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన ఎంబడి శ్రీకాంత్‌ను శనివారం కాంగ్రెస్‌పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, శంకర్, విజయ్, శేఖర్, బాపురావు, భీమయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల ఇన్‌చార్జి ఏపీఎంగా రాజ్‌కుమార్

జైనూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జీ ఏపీఎంగా రాజ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఏపీఎంగా బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మండలంలో స్వయం సహాయక సంఘాలను చైతన్యపరచి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీఏవోలు, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డు జారీ కోసం సర్వే

కాగజ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో కొత్త రేషన్ కార్డులు జారీచేస్తున్న నేపథ్యంలో కాగజ్‌నగర్ మండలంలోని బురదగూడ, తదితర గ్రామాల్లో శనివారం ఎంపీడీవో రమేష్ దరఖాస్తుదారులసర్వేలుచేశారు. కార్యక్రమంలో ఎంపీవో బుచ్చన్న, పంచాయతీ సెక్రెటరీశ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

చెప్రాలకు ప్రారంభమైన భక్తుల మహాపాదయాత్ర

బెజ్జూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి(బి) అభయాంజనేయస్వామి ఆలయం నుంచి మహారాష్ట్రలోని చెప్రాల హనుమాన్ మందిర్ ప్రశాంత్ ధాం వరకు భక్తులు 20వ మహాపాదయాత్ర శనివారం నిర్వహించారు. మహాపాదయాత్రను బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఎస్సై ప్రవీణ్ కుమార్ జెండాఊపి ప్రారంభించారు. భాజా భజంత్రీల మధ్య గ్రామంనుంచి ఈ పాదయాత్ర బెజ్జూరు, కుకుడ, పోతెపల్లి, బారెగూడ, ముంజంపల్లి, రుద్రాపూర్, చింతలమానేపల్లి, బాబాపూర్ తదితర గ్రామాలమీదుగా సుమారు 45కిలోమీటర్ల సాగింది. సాయంత్రం ప్రశాంత ధాంకు చేరుకున్నారు. మహాపాద యాత్రగా వెళ్తున్న భక్తులకు ఆయా గ్రామాల్లో ప్రజలు ఘన



పాదయాత్రను ప్రారంభిస్తున్న డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్

స్వాగతం పలికారు. గ్రామగ్రామాన భక్తులు తేనీరు, అల్పాహారం అందించి పాదయాత్రలో పాల్గొన్నారు. చెప్రాల ఆధ్యాత్మిక కేంద్రానికి చేరుకున్న భక్తులకు రాత్రి సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అభయాంజనేయ స్వామి ఆలయకమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, కంకాలమ్మ ఆలయ చైర్మన్ కనకయ్య, రంగనాయక ఆలయకమిటీ అధ్యక్షుడు మహేష్, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యుడు భాస్కర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: మహాపాదయాత్ర భక్తులకు శనివారం కౌటాల మండలం తుమ్మిడిహెట్టి ప్రాణహిత పుష్కరఘాట్ వద్ద శివసిద్ధి హనుమాన్ మందిర్, తాట్‌పల్లి కుల్తా ఆలయకమిటీ అధ్యక్షుడు దత్తు పటేల్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు.

మాలి సంఘం నాయకులకు సన్మానం



నాయకులను సన్మానిస్తున్న ప్రజలు

కౌటాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మాలిసంఘం భవనంలో శనివారం ఎన్నికైన మాలిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్యాంరావు, రాష్ట్రప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, జిల్లాఅధ్యక్షుడు వాను, ప్రధాన కార్యదర్శి గంగారాంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘంనాయకులు నాందేవ్, ప్రదీప్, నిహారిక, జ్యోతిరావు,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న 'లక్షడప్పులు.. వెయ్యిగొంతులు' కార్యక్రమం

రెబ్బెన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే 'లక్ష డప్పులు, వెయి గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావు మాదిగ కోరారు. శనివారం రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణ అమలు చేయాలని ప్రధాన డిమాండుతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 22న ఆసిఫాబాద్‌లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగతో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాఇన్‌చార్జి బుర్రిసతీష్ మాదిగ, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు చెన్నూరు సోమన్న, సీనియర్ నాయకులు లింగంపల్లి ప్రభాకర్, బొంగు నర్సింగరావు, వేమునూరు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగుంట కేశవ్‌రావు మాదిగ

ఆఖరి మజిలీ.. కష్టాలు తీరేదెప్పుడో?

● జిల్లా కేంద్రంలో ఒక్కటే శ్మశానవాటిక ● అందులోనూ కనీస సౌకర్యాలు కరువు

● వాగులు, ఒర్రెలలో దహన సంస్కారాలు

అంతిమయాత్రకు అవస్థలు తప్పడం లేదు.. జిల్లా కేంద్రంలో జనాభాకు సరిపడా నాలుగు శ్మశాన వాటికలుం డాలనేది ప్రజల డిమాండ్. కానీ ఒకటి మాత్రమే అందుబాటులో ఉంది. అది కూడా కనీస సౌకర్యాలు లేక నిరుపయోగాంగా మారింది. దీంతో దహన సంస్కారాలను వాగులో, ఒర్రెలలో కానిచ్చేస్తున్నారు. వాగులు పొంగితే బాధలు చెప్పనలవి కాదు.

ఆసిఫాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొన్ని సంవత్సరాల క్రితం పెద్దవాగు నది తీరాన నిర్మించిన శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. ప్రభుత్వం మాత్రం దహన సంస్కారాలకు ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో శ్మశాన వాటికలను నిర్మించింది. కానీజిల్లా కేంద్రంతో పాటు మండలంలో చాలావరకు నిర్మించిన శ్మశాన వాటికలు కనీససౌకర్యాలకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. మండలంలో మొత్తం 27గ్రామాల్లో వైకుంఠదామాలను నిర్మించగా పూర్తిస్థాయిలో వసతులు కల్పించక పోవడంతో ప్రస్తుతం కనీసం 90శాతంవరకు వినియోగంలోకి రాలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తప్పని ఇబ్బందులు..

మూడుకాలాల్లోనూ దహన సంస్కారాలకు జిల్లా కేంద్రంలోని ప్రజలకు ఇబ్బందులే. ముఖ్యంగా వర్షాకాలం దురదృష్టవశాత్తు ఎవరైనా మరణిస్తే దహన సంస్కారాలకు నరకం చూడాల్సిందే. జిల్లా కేంద్రంలోని సుమారు 40వేలకుపైగా ఉన్నజనాభాకు కనీసం నాలుగు ప్రాంతాల్లో శ్మశాన వాటికలు నిర్మిం చాలన్న డిమాండ్ ప్రజల్లో ఉంది. ఎట్టకేలకు ఒకటి నిర్మించినా అది నిరుపయోగంగా మారింది. దీంతోవాగులు, వంకలు, ఒర్రెల సమీపంలో దహనసంస్కారాలు చేస్తున్నారు. అకస్మాత్తుగా వాగులుపొంగితే దహన సంస్కారాలకు తీవ్రఇబ్బందులు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే మారుమూల గ్రామాల్లో పరిస్థితి మరీఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ చూపి శన్మానవాటికల్లో కావాల్సిన కనీస వసతులు కల్పించాలని పట్టణ పరజలు కోరుతున్నారు.





ఆసిఫాబాద్‌లో నిరుపయోగంగా ఉన్న శ్మశాన వాటిక, (ఇన్‌సెట్లో) శ్మశాన వాటిక దారి

కనీస సౌకర్యాలు కల్పించాలి..

- ప్రణయ్, ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలో కనీసం నాలుగు శ్మశానవాటికలు అవసరమున్నా ఒకటి మాత్రమే నిర్మించారు. అందులో కూడా కనీస సౌకర్యాలు లేకపోవడంతో అదికూడా నిరుపయోగంగా మారింది. శ్మశాన వాటికను నిర్మించి నాలుగు సంవత్సరాలు పూర్తైనా నేటికీ కనీస సౌకర్యాలను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఇప్పటికైనా ప్రస్తుతం నిర్మించిన శ్మశాన వాటికలో కనీస వసతులు కల్పించాలి.

కుహు.. కుహూ.. సరాగాలు..

- బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ని ప్రారంభించిన సబ్ కలెక్టర్, ఏఎస్పీ, ఎఫ్‌డీవో
- 15 రకాల విదేశీ పక్షుల సందడి
- పాల్గొన్న 30మంది ఔత్సాహిక పక్షి ప్రేమికులు

పచ్చని చెట్లు.. ఎత్తైన కొండలు.. వన్యప్రాణులు.. సుమారు 300కు పైగా రకాల పక్షులు.. పెద్దవాగు, ప్రాణహిత సంఘుమ పరిహాక ప్రాంతం.. వీటికి తోడు శీతాకాలంలో వచ్చే విడిది వలస పక్షుల కిలకిల రావాలతో విరసిల్లుతున్న పెంచికలపేట రేంజ్ పరిధిలోని అటవీప్రాంతం శనివారం బర్డ్‌వాక్ ఫెస్టివల్-3తో పక్షి ప్రేమికులను పరవశించేలా చేసింది. - పెంచికలపేట





అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచికలపేట రేంజ్‌లో నిర్వహించిన బర్డ్‌వాక్ ఫెస్టివల్-3లో పాల్గొనేందుకు 30మంది ఔత్సాహిక పక్షిప్రేమికులు శుక్రవారం సాయంత్రం పెంచికల్‌పేటకు చేరుకున్నారు. రాత్రి ఇక్కడే బసచేశారు. శనివారం ఉదయం సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఎఫ్‌డీవో బోబడే సుశాంత్ సుకుదేవ్‌తో కలిసి బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ను ప్రారంభించారు.

ప్రధాన ఆకర్షణ..

15రకాల విదేశీ పక్షుల ఆగమనం బర్డ్‌వాక్ ఫెస్టివల్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులో బ్లాక్ డ్రాగన్లో, యుఏషాన్ స్పూన్ బిల్, బిట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్, కామన్ హోప్, రివర్ టర్న్, గ్రేహార్న్ బిల్, నార్తర్న్ ఫిన్టెయిల్, స్పాట్ బిల్ డక్స్, బ్లాక్ వింజర్డ్ స్టిల్ట్, రెడ్ వాటర్ లాప్పింగ్, గ్రీన్ బిఈటర్, ఒపెన్‌బిల్ స్టార్క్ మొదలగు విదేశీ పక్షులు ఔత్సాహికులను ఆనందింప జేశాయి. మధ్యాహ్నం పొడుగు ముక్కు రాబందుల ఆవాసమైన పాలరాపు గుట్ట వద్దకు పయనమయ్యారు. పెద్దవాగు-ప్రాణహిత సంగమ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుంది.

ముందుగా ఎల్లూరు బొక్కి వాగు ప్రాజెక్టు వద్ద పక్షులను వీక్షించారు. ఈ ప్రాంతంలో సుమారు 35రకాల దేశీ, విదేశీ పక్షులను గుర్తించి తమ తమ కెమెరాలలో బంధించారు. పక్షిప్రేమికులకు ఎఫ్ఆర్వో అనీల్ కుమార్ వాటి ప్రాముఖ్యతను వివరించారు.



నిరాశే మిగిలింది..

పెంచికలపేట రేంజ్ అంటేనే ముందుగా గుర్తొచ్చేది పాలరాపు గుట్ట పై ఉన్న అంతరించి పోయే దశలో ఉన్న పొడుగు ముక్కు రాబందులు. అయితే రెండు మూడేళ్లుగా రాబందుల జాడ అంతగా కనిపించడం లేదు. దీంతో ఈ బర్డ్ వాక్ ఫెస్టివల్‌లో వాటిని చూద్దాం అనుకున్న పక్షి ప్రేమికులకు మళ్లీ నిరాశే ఎదురయింది. గతంలో సుమారు 30 రాబందులు ఉండేవని అటవీ శాఖాధికారుల అంచనా.





బర్డ్ ఫెస్టివల్‌లో కెమెరాలో పక్షులను బంధిస్తున్న పక్షి ప్రేమికులు



సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో బర్డ్ వాక్-3

సిర్పూర్(టి), జనవరి 18(ఆంధ్రజ్యోతి): అటవీశాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో శనివారం బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ను ఘనంగా ప్రారంభించారు. వివిధ రకాల దేశ, విదేశీ పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో చింతకుంట సెక్షన్‌లోని వివిధ కుంటలు, హీరాపూర్‌వాగు, జీడివాగు తదితర ప్రాంతాల్లో పక్షి ప్రేమికులు పర్యటించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో సుశాంత్‌బోబడే, ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్, సెక్షన్‌ఆఫీసర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ...

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

- అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్



ఆంధ్రజ్యోతి: రానున్న వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

కమిషనర్: వేసవి కాలంలోనే కాకుండా ప్రస్తుతం పట్టణంలోని అన్నికాలనీల్లో తాగునీటి ఎద్దటి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి: మున్సిపాలిటీ పరిధిలో నీటి వినియోగం ఎంత ఉంది? లీకేజీ సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

కమిషనర్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో 30 వార్డుల్లో 60వేలపైగా జనాభా కు సరిపడా తాగునీటి సరఫరా జరుగు తోంది. పట్టణ సమీపంలోని పెద్దవాగు నుంచి 4ఎంఎల్‌డీ(మెగా లీటర్స్ పర్‌డే) నీరు, ప్రస్తుతం అడ ప్రాజెక్టు ద్వారా 7 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేసి సరఫరా చేస్తు న్నాం. లీకేజీలు ఏర్పడుతున్నట్లు ఫిర్యాదు రాగానే వెంటనే డీఈఈ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: పట్టణంలో ఎన్ని మంచినీటి కనెక్షన్స్ ఉన్నాయి.

కమిషనర్: పట్టణంలో 6వేల మంచినీటి కనెక్షన్స్ ఉన్నాయి. మంచినీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు పలుపథకాల కింద వచ్చిన నిధులతో కౌన్సిల్ తీర్మానంతో పైపులైను పనులు చేపడుతున్నాం. పెద్దవాగువద్ద గతంలో ఉన్న పంపులతోపాటు ప్రస్తుతం బిగించిన నూతనపంపు, మోటార్స్‌తో ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా జరుగుతోంది. వచ్చే వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అన్ని వార్డుల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

కాగజ్‌నగర్ టౌన్,(ఆంధ్రజ్యోతి)

ప్రశాంతంగా నవోదయ 6వ తరగతి ప్రవేశపరీక్ష

- ఉమ్మడి జిల్లాలో 5191విద్యార్థుల దరఖాస్తులు
- 1024 మంది విద్యార్థులు గైర్హాజరు

కాగజ్‌నగర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశపరీక్ష శనివారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా జరిగిందని ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. శనివారం నవోదయ విద్యాలయంలో పరీక్ష వివరాలను వెల్లడించారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 5191మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా ఇందులో 1024మంది విద్యార్థులు పరీక్ష రాయలేదన్నారు. ఉమ్మడిజిల్లాలో మొత్తం 4167మంది పరీక్షకు హాజరైనట్లు, 80శాతం నమోదైనట్టు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో 1383మంది విద్యార్థులకు 1090హాజరు కాగా, 293 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. కుమురం భీం జిల్లాలో 1159 మందికి 805హాజరు కాగా, 354గైర్హాజరైనట్టు, నిర్మల్ జిల్లాలో 1479దరఖాస్తులు చేసుకోగా 1310హాజరు కాగా, 169 గైర్హాజరైనట్టు, ఆదిలాబాద్ జిల్లాలో 1170దరఖాస్తులు చేసుకోగా, 962 పరీక్ష రాయగా, 208మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు తెలిపారు.

లక్సెట్టిపేటలో..

లక్సెట్టిపేట: లక్సెట్టిపేట పట్టణంలో శనివారం నవోదయ పరీక్ష ప్రశాంతంగా కొనసాగింది. పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండు కేంద్రాల్లో 388మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 109 మంది గైర్హజరు కావడంతో 279మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య పరిశీలించి కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.



కాగజ్‌నగర్‌లో పరీక్ష కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన నవోదయ ప్రిన్సిపాల్ పార్వతి

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజేందర్ (ఫైల్)

నెన్నెల/వేములవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద వ్యక్తిగా భావించి స్థానికులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈనెల 15న నెన్నెల మండలం జెండా వెంకటాపురం గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్ (26) అనే యువకుడు స్నేహితులతో కలిసి రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం బైక్‌పై వస్తూ దారితప్పి భగవంతరావునగర్‌లోని తాటికొండ రాజయ్య ఫంక్షన్ హాల్ వైపునకు వెళ్లారు. అక్కడే ఉన్న కొందరు యువకులు వారిని ప్రశ్నించారు. సమాధానం చెప్పేందుకు తడబడడంతో దొంగలుగా భావించిన స్థానికులు చితకబాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన రాజేందర్‌తోపాటు మరొకరిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న రాజేందర్ శనివారం మృతి చెందినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. దాడికి పాల్పడిన యువకుల కోసం సీసీ ఫుటేజీని పరిశీలించామని, నిందితులను పట్టుకునేందుకు గాలింపు చేపట్టామని సీఐ తెలిపారు.

అక్రమ కలప పట్టివేత

జన్నారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇందన్‌పల్లి రేంజ్‌లోని హాస్టల్ తండా నాయకపుగూడ గ్రామాల్లో ముందస్తు సమాచారం మేరకు శనివారం అటవీ అధికారులు తనిఖీ చేశారు. అక్రమంగా నిల్వ ఉన్న కలపను పట్టుకుని రేంజ్ కార్యాలయం తరలించినట్లు ఎఫ్ఆర్వో శ్రీనివాస్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా కలప నిల్వ రవాణా చేసిన చర్యలు తీసుకొంటామన్నారు.

గంజాయి పట్టివేత

జన్నారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పైడిపెల్లి హనుమాన్ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పైడిపెల్లి హనుమాన్ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మహ్మదాబాద్ గ్రామానికిచెందిన కామెర నగేష్, వెంబడి పవన్‌లను తనిఖీ చేయగా 30 గ్రాముల గంజాయి దొరికిందన్నారు. అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెల్లంపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాత బెల్లంపల్లి గ్రామ శివారులో శనివారం పలువురు పేకాడుతుండగా పట్టుకున్నట్లు తాళ్లగురిజాల పోలీసులు తెలిపారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 18850 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు, మూడు బైక్‌లను సీజ్ చేశామన్నారు.

వాగులో మునిగి ఒకరు మృతి

కెరమెరి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దేవాడ గ్రామానికి చెందిన కోట్నాక మారు(30) పోతరాజు ఆలయ సమీపంలోని వాగులో మునిగి మృతిచెందినట్లు ఎస్సై విజయ్ తెలిపారు. మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లా దేవాడ గ్రామానికి చెందిన మారు ఈనెల16న పోతరాజు జాతరకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. జాతర సమీపంలోని వాగులో వెతకగా మారు మృతదేహం లభించింది. మృతుడి తండ్రి దౌలత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

బెజ్జూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): లంబాడీగూడ, సలుగుపల్లి, రెబ్బెన గ్రామాల్లో శనివారం ఎక్సైజ్ సీఐ రవి ఆధ్వర్యంలో నాటుసారా స్థావరాలపై పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ మేరకు 40లీటర్ల నాటుసారా స్వాధీనపర్చుకుని, 800లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం 14మందిని తహసీల్దార్ భూమేశ్వర్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు లోభానంద్, సురేష్, బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మేదరిపేటలో బెల్లం, పట్టిక లభ్యం

దండేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మేదరిపేట, లింగాపూర్‌లో ఎక్సైజ్ సిబ్బంది దాడుల్లో బెల్లం, పటిక పట్టుకున్నట్లు ఎక్సైజ్ శాఖ ఇన్‌చార్జి సీఐ సమ్మయ్య పేర్కొన్నారు. లింగాపూర్ గ్రామానికి చెందిన బోడ పంచిబాయి వద్ద 2లీటర్ల గుడుంబా, మేదరిపేట గొలి రమేష్‌కు చెందిన కిరాణ దుకాణంలో 95 కిలోల నాటుసారకు ఉపయోగించే బెల్లం, 10కిలోల పట్టిక పట్టుకున్నామని తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై మౌనిక, సిబ్బంది ఇస్పత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతియాదవ్, వెంకటేష్, శిరిష ఉన్నారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి



తిమ్మాపూర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో

లక్సెట్టిపేట రూరల్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం తిమ్మాపూర్, చందారం గ్రామ పంచాయతీ కార్యాలయాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపుయార్డులకు తరలించాలన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు కనిపించకుండా చూసుకోవాలని, ఇంటి పన్ను వసూలు వేగవం తం చేయాలన్నారు. జీపీల్లో రికార్డులను పరిశీలించారు. మండల పం చాయతీ అధికారి శ్రీనివాస్, సెక్రటరీలు దుర్గాదేవి, శ్రీలత పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

మంచిర్యాల క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని రామగుండం కమిషనరేట్ ఏసీపీ జె నర్సింహులు అన్నారు. శనివారం పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారితో ప్రతిజ్ఞ చేయించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతి వేగంగా వెళ్లవద్దని, పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, ప్రతీ ఒక్కరు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, ఎస్సై రాములు, ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. మంచిర్యాల లారీ డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

మంచిర్యాల క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): డీఈవో కార్యాలయంలో జిల్లా విద్యాధికారి యాదయ్య పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు ధరనికోట వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి సూరినేని గంగాధర్, రాష్ట్ర అసోసియేషన్ నాయకులు భారతి, శైలజ, రవికాంతరావు, కొత్త సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ అధికారులు, కార్యదర్శుల క్యాలెండర్లను కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావులు విడుదల చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీపతి బాపురావు, ప్రధాన కార్యదర్శి అజ్మత్, సప్దర్ ఆలీ, అనిల్‌కుమార్, శ్రీనివాస్, వియ్‌ప్రసాద్,అక్తర్, సతీష్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారుల పనితీరు ఆందోళనకరంగా ఉంది

- కాంపెల్లి సమ్మయ్య



మాట్లాడుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

మందమర్రి టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పైస్థాయి అధికారుల పనితీరు ఆందోళనకలిగిస్తోందని ఐఎన్టీయూసీ కేంద్రకమిటీ సినియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య పేర్కొన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా గనుల జీఎంల నుంచి మొదలుకొని ఏజెంట్లు, మేనేజర్లు, గ్రూపుస్థాయి అధికారుల్లో సమన్వయం కొరవడుతోందనే సంకేతాలు వస్తున్నాయని తెలిపారు. ప్రధానంగా ఈ మధ్య కాలంలో జీవితకాలం ఉన్న గనుల మూసివేతపై పలు అనుమానాలు వస్తున్నాయని అన్నారు. ఓసీలపరిస్థితి కూడా అదేస్థాయిలో ఉందన్నారు. దశాబ్దంక్రితం ప్రారంభించిన ఆర్కేఓసీని ప్రస్తుతం మూసివేయడం వెనుకప్లాన్ లేదా అనిప్రశ్నించారు. చెన్నూరు నియోజకవర్గంలోని దశాబ్దం క్రితం ప్రారంభించిన మూడుగనులు పట్టుమని మూడు సంవత్సరాలు కాకముందే మూసివేశారన్నారు. దీనినిదృష్టిలో పెట్టుకొని నూతన గనుల ఏర్పాటుతో పాటు గనులమూసివేతపై రాష్ట్ర సలహా మండలిచైర్మన్ ఆధ్వర్యంలో సింగరేణిలో పోరుబాటకు సిద్ధమవుతున్నామన్నారు.

ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ ప్రచారకార్యదర్శిగా లక్ష్మణ్‌దాస్

కాసిపేట, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఐఎన్‌టీయూసీ కేంద్రకమిటీ ప్రచారకార్యదర్శిగా కాసిపేట1వగనిలో జూనియర్‌అసిస్టెంట్‌గా పని చేస్తున్న బన్న లక్ష్మణ్‌దాస్ నియమితులయ్యారు. శనివారం ఆయనను నియమిస్తూ ఐఎన్‌టీయూసీ సెక్రటరీజనరల్ జనక్‌ప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. యువజన విభాగం ఎన్ఎస్ యూఐ, కాంగ్రెస్ అనుబంధ సంఘాల్లో లక్ష్మణ్‌దాస్ సేవలు అందించాడు. దీన్ని గుర్తించి ఆయనకు ఈ పదవీ అప్పగించారు. జాతీయ నాయకత్వానికి బన్న లక్ష్మణ్ దాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రైవేటు పనులకు సింగరేణి ఎక్స్‌కావేటర్

కాసిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎక్స్‌కావేటర్‌ని కొందరు స్థానిక నాయకులు ప్రైవేటుపనులకు ఉపయోగించి సొమ్ము చేసుకుంటున్నారని మామిడిగూడ మాజీసర్పంచ్ సంపత్ ఆరోపించారు. శనివారం రహదారుల మరమ్మతుల కోసం సింగరేణి ఎక్స్‌కావేటర్‌ని కొందరు స్వార్థానికి వాడుకుని సొంత పనులను చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై సింగరేణి అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె తప్పదు

జైపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే మరోమారు సమ్మె తప్పదని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం ఎస్టీపీపీలోని కాంట్రాక్టు కార్మి కులు ఒక్కరోజు సమ్మె చేపట్టగా ఆయన పాల్గొని మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను యాజమాన్యం పరిష్కరించాలని లేకుంటే నిరవధిక సమ్మెకు సైతం వెనకాడే ప్రసక్తే లేదన్నారు. సింగరేణి యాజమాన్యం నూతనంగా చేపట్టే ప్లాంటు పనులను సైతం అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎస్టీపీపీలో పనిచేస్తున్న ఆయా విభాగాలకు చెందిన సుమారు వెయ్యిమంది కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ నాయకులు తిప్పారపు సారయ్య,ఆర్. విక్రమ్ కుమార్, చిప్పకుర్తి సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె ప్రభావం లేదు: ఈడీ

జైపూర్‌లోని ఎస్టీపీపీలో హెచ్ఎంఎస్ యూనియన్ తలపెట్టిన ఒక్కరోజు కాంట్రాక్టు కార్మికుల టోకెన్ సమ్మె చేసినా కార్మికుల హాజరు శాతం తగ్గలేదని ఎస్టీపీపీ ఈడీ ఎన్వీ రాజశేఖర్‌రావు పేర్కొన్నారు. సింగరేణి పవర్ ప్లాంట్‌లో సమ్మె ప్రభావం లేదని, కరెంటు ఉత్పత్తి, బొగ్గు సరఫరా, ఫ్లైయాష్, బాటం యాష్ సరఫరా యథావిధిగానే కొనసాగిందన్నారు.



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్టు కార్మికులు

నేడు బీసీ ఉద్యోగుల ఏరియా మహాసభ

శ్రీరాంపూర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల ఏరియా మహాసభ ఆదివారం ఉదయం 10గంటల నుంచి సీసీసీలోని ఎస్సీవోఏ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా బీసీవెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ముష్కెసమ్మయ్య, బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య ఒకప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంజాలశ్రీనివాస్, ఏ నాగేశ్వర్‌రావు, సింగరేణి బీసీచీఫ్ లైజనింగ్ అధికారి పి హరిశంకర్‌రావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. సింగరేణిలో రోస్టర్‌పద్ధతిలో రిజర్వేషన్లు, పదోన్నతుల అమలు, దామాషాపద్ధతిలో హక్కులు అందజేత, కార్యాలయ సదుపాయం, తదితర సమస్యలపై చర్చిస్తామన్నారు. బీసీ ఉద్యోగులు మహాసభను విజయవంతం చేయాలని కోరారు.

సింగరేణి భూముల వివరాలు తెలుపండి



ఎస్టేట్స్ జీఎంతో మాట్లాడుతున్న ఏరియా జీఎం

శ్రీరాంపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి చెందిన భూముల వివరాలు తెలుపాలని కార్పొరేట్ జీఎం(ఎస్టేట్స్) ఎన్ రాధాకృష్ణ అన్నారు. శనివారం ఆయనతో ఏరియా జీఎం ఎల్వి సూర్యనారాయణ సింగరేణి విశ్రాంతి గృహంలో భేటీ అయ్యారు. బెల్లంపల్లి రీజియన్‌లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియా లకు చెందిన భూముల వివరాల గురించి తెలుసుకున్నారు. ఎస్టేట్స్ విభాగం అధికారులు ఆయనకు వివరాలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఎస్టేట్స్ అధికారులు వరలక్ష్మీ, స్వప్న, పి మహేష్, శ్రీరాంపూర్ అదనపు మేనేజర్ మహేష్, కార్పొరేట్ అదనపు మేనేజర్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులకు హాజరు కావాలి

శ్రీరాంపూర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు బాధ్యతగా విధులకు హాజరు కావాలని ఆర్‌కే6 గని మేనేజర్ ఈ తిరుపతి అన్నారు. తక్కువ మస్టర్లు ఉన్న ఉద్యోగులకు శనివారం మేనేజర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. గైర్హాజరుకు గల కారణాలు తెలుసుకున్నారు. తక్కువ హాజరు ఉంటే కంపెనీ తీసుకునే క్రమశిక్షణ చర్యలకు గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. కుటుంబ సభ్యులు సైతం ఉద్యోగులు విధులకు గైర్హాజరు కాకుండా చూసుకోవాలని కోరారు.

కార్యక్రమంలో రక్షణాధికారి శ్రీనివాస్, సంక్షేమాధికారి సురేందర్, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలి

రెబ్బెన, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు సీఎంపీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ అన్నారు. శనివారం కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొయ్యడ సాగర్‌గౌడ్, జంపయ్య, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం(140/2018) ఆధ్వర్యంలో ముద్రించిన నూతనసంవత్సర క్యాలెండర్‌ను జీఎం ఎల్వి సూర్యనారాయణ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీలైజన్ అధికారి కెకిరణ్‌కుమార్, అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నాగేశ్వర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వోల్వో, డంపర్, ట్రక్‌నడిపేందుకు అవసరమైన ప్రాథమిక డ్రైవింగ్ శిక్షణనుఉచితంగా ఇవ్వనున్నట్లు ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పాసై ఉండి, హెవీగూడ్స్ వెహికల్‌లైసెన్స్ కలిగిఉన్న నిరుద్యోగులు శ్రీరాంపూర్ ఏరియా వృత్తిశిక్షణ కేంద్రంలో ఈనెల 20లోగా దరఖాస్తులు అందించాలన్నారు.

కార్పొరేషన్‌గా మంచిర్యాల

5వ పేజీ తరువాయి

ఈ మూడేళ్లలో ఆయా స్థానిక సంస్థల పరిధిలో మరింతగా జనాభా పెరగడం, 150 చదరపు కిలోమీటర్ల వైశాల్యం ఉండటంతో మున్సి పల్ కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

ఉమ్మడి జిల్లాలోనే ప్రత్యేక స్థానం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే మంచిర్యాల పట్టణానికి ప్రత్యేక స్థానం ఉంది. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపాటు ప్రధాన రైల్వే మార్గం అందుబాటులో ఉంది. మొదటి సారిగా 1956లో మంచిర్యాల మున్సిపాలిటీగా ఏర్పాటు కాగా, అప్పటి నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతోంది. 2016లో మంచిర్యాల పట్టణం జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత మరింతగా అభివృద్ధి చెందింది. ప్రస్తుతం 36 వార్డులతో ఉన్న మంచిర్యాల విద్య, వైద్య సదుపాయాలకు నిలయంగా ఉంది. మంచిర్యాల చుట్టు పక్కల బొగ్గు బావులు, సిరామిక్ ఇండస్ట్రీలతోపాటు, విద్యుత్ పరిశ్రమలు ఉన్నాయి. వాణిజ్యపరంగా అభివృద్ధి చెందిన ప్రాంతంగా పేరుంది. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్‌గా అవతరించనుండటంతో మరింత అభివృద్ధి దిశగా పయనించే అవకాశాలు ఉన్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడ్డ నాటి నుంచే మంచిర్యాల మునిసిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడుతుందనే ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవతో ప్రభుత్వం గెజిట్ విడుదల చేయగా ఎట్టకేలకు మంచిర్యాల మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా ఏర్పాటు కాబోతోంది.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

దండేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో 2025-2026 సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామగిరి రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7 తరగతి నుంచి 9వ తరగతి, పదో తరగతి వరకు ఖాళీ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 28లోగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

పరీక్ష సామగ్రి అందజేత

చెన్నూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పొక్కూరు గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయుడు రమేష్ సొంత ఖర్చులతో శనివారం పరీక్ష సామగ్రిని అందజేశారు. హెచ్‌ఎం దత్తకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీఎన్‌జీవో భవన్‌లో సన్మానం



ఎన్నికైన వారిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

గర్మిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ సభ్యులను శనివారం టీఎన్‌జీవో భవన్‌లో సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, కార్యదర్శి మహ్మద్ హబీబ్‌హుస్సేన్, ఉపాధ్యక్షుడు మొండయ్య, సంయుక్త కార్యదర్శి రామ్మోహన్, కోశాధికారి రాజమౌళితో పాటు కార్యవర్గ సభ్యులను సన్మానించారు. గోపాల్, కళావతి, ప్రసాదరావు, ఇంతియాజ్, సంతోష్, హన్మంతరావు, బాపురావు, మల్లయ్య, గోవిందరెడ్డి, లలిత, సునీత,మధుసూదన్ రెడ్డి , శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే అభివృద్ధి పనులు

మంచిర్యాల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కృషి వల్లనే అభివృద్ధి పనులు సాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య అన్నారు. శుక్రవారం రాత్రి రంగపేట స్ట్రీట్ లైట్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన కౌన్సిలర్ బొలిశెట్టి సునిత కిషన్‌ల కృషి అభినందనీయమన్నారు. ఎన్నో ఏండ్ల నుంచి స్ట్రీట్ లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్ చెప్పడంతోనే ఎమ్మెల్యే ఏర్పాటు చేయించారన్నారు. కార్యకర్తలు బొల్లం భీమయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

జైపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పౌనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సికిందర్ శనివారం ఎంఈవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ సింధూరకు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మూడు గ్రామాల విద్యార్థులు చదువుకుంటున్నారని, 6వ తరగతికి గది లేక ఆరు బయట కూర్చుని చదువుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. తరగతి గది నిర్మించాలన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

బెల్లంపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ నర్సయ్యకు ఎస్‌ఐగా పదోన్నతి వచ్చిన సందర్భంగా శనివారం మాలమహానాడు నాయకులు ఆయనను సన్మానించారు. రాజేష్, గోపి, చంద్రశేఖర్, మురళీ,చక్రధర్, సమ్మయ్య, రాజలింగు, కొమురయ్య, రాంకుమార్, సతీష్ పాల్గొన్నారు.


బహుముఖ ప్రజ్ఞాశాలి

- ధూంధాం కళాకారుడు, చిత్రలేఖనంలో మేటి గూడ రాజేందర్





ధూంధాంలో పాటలు పాడుతున్న రాజేందర్



బియ్యం గింజలపై జాతీయ నాయకుల చిత్రాలు

దండేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలానికి చెందిన గూడ రాజేందర్ పాటల రచయి తగా, కళాకారుడుగా, చిత్రలేఖనంలోనూ రాణిస్తున్నాడు. జీవకళ ఉట్టిపడేలా వైవిధ్యమైన చిత్రాలు గీస్తూ భళా అనిపించుకుంటున్నాడు. తెలంగాణ ధూంధాంలో పాటలు పాడుతూ తనకంటూ ఓ ప్రత్యేకతను సొంతం చేసుకున్నాడు. అంతేగాక సాంఘిక దురాచారాలపై జానపద గీతాలతో ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ గుర్తింపు తెచ్చుకున్నాడు.

లింగాపూర్ గ్రామానికి చెందిన ప్రజాకవి, రచయిత, గాయకుడు గూడ అంజయ్య అన్న నర్సయ్య కుమారుడు గూడ రాజేందర్. చిత్రలేఖనంపై ఆసక్తితో ఎవరి వద్ద శిక్షణ లేకుండానే రాజేందర్ మెలకవలు నేర్చుకున్నాడు. ధాన్యం గింజ, కోడిగుడ్డు పెంకులను కళా ఖండాలుగా రూపుదిద్దుతున్నాడు. ధాన్యం గింజలపై గాంధీ, నెహ్రూ, శివాజీ, అబ్దుల్ కలాం, ఇందిరాగాంధీ తదితర నాయకుల చిత్రాలు వేశాడు. ఇవే గాక వెదురు పుల్లలతో ఈఫిల్‌టవర్, అందమైన చిత్రాలను రూపొందించి ప్రశంసలందుకున్నారు. ఆర్థి కంగా చేయూతనిచ్చే వారు లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం గతంలో ఉపాధిహామీ పథకంలో కూలీగా మారడమే కాకుండా లింగాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలోని చిత్రలేఖనం ఉపాధ్యాయుడిగా పని చేశాడు. సాంఘిక దురాచారాల నుంచి ప్రజలను చైతన్యవంతుల్ని చేసే ఉద్దేశ్యంతో జానపద గీతలు రాసి తనవంతు ప్రయత్నం చేస్తున్నాడు. దీనికి తోడు 3డి ఆర్ట్, ఆప్లయిడ్ ఆర్ట్, డాట్ ఆర్ట్‌లో ప్రావీణ్యం ఉన్నా అవకాశాలు కోసం ఎదురు చేస్తున్నాడు.

గూడ రాజేందర్ పలు పాటలు రాశాడు. పుడితే ఒక్కటే సత్తె రెండు రాజన్నల రాజిగో. ఎత్తుర తెలంగాణ జెండా రాజన్న రాజిగో. నాతెలంగాణ నా తెలంగాణ, కలగంటి కాలగంటి నయ్యా నేను కాలగంటినయ్యా అనే పాటలను బాబాయ్ గూడ అంజయ్యతో కలిసి తెలంగాణ ఉద్యమ పాటలు రచించి ఆలపించాడు.


నంది అవార్డు అందుకున్న రాజేందర్

కళా రంగంలో విశిష్ట సేవలు అందించినందుకుగాను గూడ రాజేందర్‌కు ఆదర్శ కళా రత్న నంది అవార్డు అందుకున్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలో జన్నారం చెందిన ఆదర్శ కళ సమితి 25వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వ హించిన కార్యక్రమంలో గూడ రాజేందర్‌కు నంది అవార్డు ఇచ్చి సత్కరించారు.









గూడ రాజేందర్ గీసిన చిత్రాలు

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



వేమనపల్లిలో సర్వే పరిశీలిస్తున్న ఆర్డీవో హరికృష్ణ, వెల్గనూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ సంధ్యారాణి

వేమనపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా, రేషన్‌కార్డుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో హరికృష్ణ సూచించారు. శనివారం కేతనపల్లి, వేమనపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ రమేష్, ఏఈవో రుక్సార్ సుల్తానా, కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): నర్సింగాపూర్, నర్సాపూర్‌లో జరుగుతున్న రైతు భరోసా సర్వేను మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ పరిశీలించారు. ఆర్‌వో ఎఫ్‌ఆర్ పట్టాదారులు కూడా రైతుభరోసాకు అర్హులన్నారు. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతు భరోసా సహాయం అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి జగదీష్ ఉన్నారు. చంద్రవెల్లి, రాంపూర్‌లో అధికారులు సాగుకు యోగ్యం కాని భూముల వివరాలకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సుష్మ, అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారి శంకర్, కార్యదర్శులు కార్తీక్‌రాజు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): అందుగులపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుభరోసా సర్వే నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను సేకరించారు. ఏయే సర్వే నెంబర్లలో రైతులు సాగు చేస్తున్నారు, సాగుకు అనుకూలంగా ఉన్నాయా లేదా పరిశీలించి నమోదు చేసుకున్నారు. ఏడీ బానోత్ ప్రసాద్, తహసీల్దార్ సతీష్‌కుమార్, వ్యవసాయాధికారి జ్యోతిర్మయి, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జీ కడారి జీవన్‌కుమార్, ఏఈవో తిరుపతి, ఆర్‌ఐ గణపతి, కార్యదర్శి వీరేందర్ పాల్గొన్నారు.

భీమారం, (ఆంధ్రజ్యోతి): భీమారంలో కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల సర్వేను నిర్వహించారు. దరఖాస్తుదారుల ఇండ్లకు వెళ్లి వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యదర్శి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, రేషన్‌కార్డుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సాంబశివరావు అన్నారు. కొండాపూర్, కోనూరు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎంపీవో సప్దర్ అలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సహాయకులు తిరుపతి, రజిత పాల్గొన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ సంధ్యరాణి సూచించారు. వెల్గనూర్, కన్నెపల్లి, లింగాపూర్ గ్రామాల్లో చేపట్టే రైతుభరోసా, రేషన్‌కార్డుల సర్వేను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సాగుకు యోగ్యం కాని భూములను సిబ్బంది క్షేత్రస్థాయిలో సర్వే చేయాలన్నారు. రేషన్‌కార్డులు లేని వారి వివరాలను సేకరించాలన్నారు. డిప్యూటీ తహసల్దార్ విజయ, ఏఈవో, రెవెన్యూ శాఖ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

కోటపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్‌ఐ రాజేందర్ పేర్కొన్నారు. శనివారం ఆలుగామ గ్రామంలో మాజీ సర్పంచు కుమ్మరి సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎస్‌ఐ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎస్‌ఐ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. మాజీ సర్పంచు, టోర్నమెంట్ ఆర్గనైజర్ కుమ్మరి సంతోష్ మాట్లాడుతూ మొదటి బహుమతి రూ.50 వేలు, ద్వితీయ రూ. 25 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు, బీసీ యువజన జిల్లా ఉపాధ్యక్షుడు రాయబారపు కిరణ్ అన్నారు. సారంగపల్లిలో జరుగుతున్న స్వర్గీయ గడ్డం వెంకటస్వామి స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను టాస్‌వేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. మాజీ సర్పంచు చంద్రకళ, నాయకులు రాములు, తాజుద్దీన్, మల్లేష్, లింగయ్య, కుమారస్వామి క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

హాజీపూర్, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రస్థాయి అండర్ 17 బాలికల ఫుట్‌బాల్ పోటీలకు దొనబండ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థిని జి.రశ్మిత ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు హనుమాండ్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ శనివారం తెలిపారు. గత నెల 21న జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారన్నారు. ఈ నెల 18 నుంచి 23 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.



చెస్‌కు చేయూత



- యేటా ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలు
- నగదు బహుమతి అందజేస్తూ ప్రోత్సాహం
- అభివృద్ధికి కృషి చేస్తున్న అసోసియేషన్ నాయకులు

మందమర్రి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చెస్ అభివృద్ధికి అసోసియేషన్ సభ్యులు కృషి చేస్తున్నారు. చెస్ ప్రాముఖ్యతపై యువతీ యువకులకు సభ్యులు అవగాహన కల్పిస్తున్నారు. పాఠశాల, కళాశాలల యాజమాన్యాలను కలుస్తూ చెస్ క్రీడను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. కొన్నేళ్ళుగా జిల్లా కేంద్రంతో పాటు మందమర్రి, బెల్లంపల్లి లాంటి ప్రధాన పట్టణాల్లో ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తూ క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తున్నారు. ఇప్పటికే 20కి పైగా పోటీలు నిర్వహించి చిన్నారుల్లో దాగి ఉన్న మేధాశక్తికి దోహదపడుతున్నారు. చెస్ అసోసియేషన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సిరాజ్ ఉర్‌రహమాన్ ప్రోత్సాహాన్ని అందించారు. చిన్నారుల్లో ఉన్న ప్రతిభను ఆయన గుర్తించి ఉచిత చెస్ శిక్షణను జిల్లాలో ఏర్పాటు చేశారు. ఇప్పటికి కూడా ఎక్కడ చెస్ పోటీలు నిర్వహించినా ఆయన ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

చెస్‌పై క్రీడాకారుల ఆసక్తి....

చెస్ క్రీడ పట్ల వయసుతో సంబంధం లేకుండా ఆసక్తి చూపుతున్నారు. ఐదేళ్ళ నుంచి ఏడు పదుల వయసు వరకు పాల్గొంటున్నారు. ఒకే చోట కూర్చొని ఆలోచనకు పదును పెట్టి ఆడే ఆటపై ఆసక్తి చూపుతు న్నారు. మందమర్రిలో ఇటీవల అండర్ 15తో పాటు ఓపెన్ టూ ఆల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి ఆదిలాబాద్‌లో పాటు కరీంనగర్ జిల్లాకు చెందిన చిన్నారులు హాజరయ్యారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతిని అందజేశారు.

ఉచిత శిక్షణ తరగతులు...

జిల్లాలో వేసవితోపాటు పండుగ సెలవులను వృథా చేయకుండా చెస్‌పై ఆసక్తి పెంచేందుకు ఉచిత శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఐదు సార్లు నిర్వహించారు. విద్యార్థులు తమ పేర్లు నమో దు చేసుకొని తరగతులను సద్వినియోగం చేసుకున్నారు. వీరి వద్ద క్రీడ నేర్చుకున్న చాలా మంది పలు బహుమతులు సాధిం చారు. ప్రతీ సంవత్సరం ఈ పోటీలకు సం బంధించి అండర్ 7 నుంచి అండర్ 19 వరకు నిర్వహిస్తున్నారు.



చెస్ ఆడుతున్న చిన్నారులు

చెస్ అభివృద్ధికి కృషి....

సిరాజ్‌ఉర్ రహమాన్, చెస్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



జిల్లాలో చెస్ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. అండర్ 7 నుంచి 19 వరకు పోటీలు నిర్వహిస్తున్నాం. ప్రతిభ ఉన్న వారిని ప్రత్యేకంగా గుర్తించి వివరాలు సేకరించి వారు జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నాం. చిన్నప్పటి నుంచే క్రీడలు విద్యార్థుల క్రమశిక్షణకు దోహదపడతాయి.

చెస్ క్రీడపై పెరుగుతున్న ఆసక్తి..

ఈగ కనకయ్య, చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్



జిల్లాలో చెస్ క్రీడ పట్ల ఆసక్తి పెరుగుతుంది. ఒకప్పుడు ఈ ఆటను ఇష్టపడని వారు కూడా ఇప్పుడు నేర్చుకొంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఆలోచనతో ఆటను ఆడవచ్చు. క్రీడాకారుల నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశాం. ప్రతీ సంవత్సరం పోటీలను నిర్వహిస్తున్నాం.

తల్లిదండ్రులు ప్రోత్సహించాలి..

కొప్పుల సత్యనారాయణ, జిల్లా ఈసీ సభ్యుడు



ఏ క్రీడనైనా తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. వారి ప్రతిభను గుర్తించాలని, వారి ఆలోచనలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలి. చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నాం. ఇక్కడ రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు సాధించిన వారు ఉన్నారు. మంచిర్యాల జిల్లాలో అండర్ 7 మొదలు ఓపెన్ టూ ఆల్ వరకు పోటీలు నిర్వహించేందుకు దృష్టి పెట్టాం.

షూటింగ్‌లకు అనుకూలంగా తెలంగాణ రాష్ట్రం

- తెలంగాణ ఫిల్మ్‌డైరెక్టర్, సినీ దర్శకుడు సురేష్‌కుమార్



మాట్లాడుతున్న డైరెక్టర్ సురేష్‌కుమార్

చెన్నూరు, జనవరి18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం షూటింగ్‌లకు అనుకూలంగా ఉందని సినీ దర్శకుడు సురేష్‌కుమార్ అన్నారు. శనివారం ఈ ప్రాంతానికి వచ్చిన ఆయన చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అద్భుతమైన లోకేషన్‌లు ఉన్నప్పటికీ షూటింగ్‌ల కోసం ఇతర రాష్ట్రాలు, దేశాలకు వెళ్లడం బాధాకరంగా ఉందన్నారు. మంచిర్యాల జిల్లాలో అడవులు, గోదావరి సెలయేళ్లు, ప్రాచీనకాలం నాటి ఆలయాలు ఉన్నాయన్నారు. శివ్వారం మొసళ్ల అభయారణ్యం, గోదావరి తీర ప్రాంతం పాపికొండ లను తలపిస్తుందన్నారు. చలనచిత్ర రంగం ద్వారా లక్షల మందికి ఉపాధి లభిస్తుందని, జూనియర్ ఆర్టిస్టులు రాణిస్తున్నారన్నారు. దర్శకులు, నిర్మాతలు తెలంగాణ ప్రాంతంలో ఉన్న లోకేషన్‌లను ఉపయోగించుకుని రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

మందమర్రిలో అక్రమ టేలాల తొలగింపు

మందమర్రి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ ప్రహరీకి ఆనుకొని వేసిన టేలాలను శనివారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. టేలాలు వేసిన వారు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. టేలాలను తొలగించి ట్రాక్టర్లలో తరలించారు. మరో టేలాను తొలగించేందుకు సిద్ధపడగా యజమాని బైఠాయించడంతో గద్దెలను కూల్చివేశారు. షాపు యజమాని రోడ్డు పక్కన పాతిన బోర్డును కూల్చివేశారు. దాదాపు మూడు గంటల పాటు తొలగింపు చేపట్టగా ప్రజలు గుమిగూడారు. మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా టేలాలు వేస్తే ఊరుకోమని తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేపట్టే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత నెన్నెల జట్టు



విజేత జట్టుకు కప్పు అందజేస్తున్న సీఐ అఫ్జలుద్దీన్

నెన్నెల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): యూత్ ఆధ్వర్యంలో చిత్తాపూర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నెన్నెల జట్టు నిలిచింది. వారం రోజులపాటు కొనసాగిన టోర్నమెంట్‌లో 28 జట్లు పాల్గొన్నాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో నెన్నెల జట్టు దహెగాం జట్టును ఓడించి చాంపియన్‌షిప్ దక్కించుకుంది. విజేతలకు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, నెన్నెల ఎస్సై చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సీఐ మాట్లాడుతూ యువకులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధించడానికి కృషి చేయాలన్నారు. నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, రాంచెందర్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలి




పిల్లలకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఈవో యాదయ్య

లక్సెట్టిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పిల్లలు పనులకు పోకుండా పాఠశాలకు వెళ్ళి చదువుకోవాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. గోదావరి రోడ్డు వీకర్ సెక్షన్‌లో ఆయన బడి బయట పిల్లల సర్వే కార్యక్రమం నిర్వహించారు. ఇంటి వద్ద ఉన్న పిల్లలను గుర్తించి తల్లితండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఈవో మాట్లాడుతూ పిల్లలను పనులకు పంపకుండ వాళ్ల బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దన్నారు. ప్రభుత్వం ఉచితంగా విద్య, రుచికరమైన భోజనం, పుస్తకాలు, దుస్తులు అందిస్తుందని తెలిపారు. జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలు బడిలో ఉండాలని సీఆర్‌పీ తిరుపతి అన్నారు. ధర్మారావుపేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని నాయకపుగూడెం, వరిపేట, బుగ్గగూడెంలో బడిబయట ఉన్న పిల్లల సర్వే నిర్వహించారు. ఈనెల 25 వరకు డ్రాపౌట్ పిల్లలను గుర్తించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): బడి మానేసిన పిల్లలను గుర్తించిన పోలీసులు పాఠశాలల్లో చేర్పించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా చైల్డ్ వెల్ఫేర్ సహకారంతో కత్తెరసాలలో నలుగురు విద్యార్థులను శనివారం చెన్నూరులోని జెడ్పీఎస్‌ఎస్ పాఠశాలలో చేర్పించారు. ఎస్‌ఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ జగన్ మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఈ నెల 25న ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవంలో ఓటు లాంటిది ఇంకొకటి లేదు - నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను అనే నినాదంతో నిర్వహించాలన్నారు. వ్యాసరచన, ఉపన్యాసం, సెమినార్ల ద్వారా ఓటు ప్రాముఖ్యతను తెలుపాలన్నారు. ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అందరు కలిసి రావాలన్నారు.

రేపటి నుంచి లబ్ధిదారుల ఎంపిక గ్రామసభలు

హాజీపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు తదితర లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 20 నుంచి గ్రామసభలు నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌రావుదేశ్ పాండే, ఎంపీడీవో ప్రసాద్, వ్యవసాయాధికారి కృష్ణలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న గడ్‌పూర్, చిన్న గోపాల్‌పూర్, నాగారాం, ర్యాలీ, పెద్దంపేట్, దొనబండ, 21న కర్ణమామిడి, బుద్దిపల్లి, టీకనపల్లి, పడ్తన్‌పల్లి, నర్సింగాపూర్, 22న హాజీపూర్, సబ్బేపల్లి, గుడిపేట్, వేంపల్లి, కొత్తపల్లి, రాపల్లి, 23న ముల్కల్ల గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. లబ్ధిదారుల పేర్లను గ్రామసభ ప్రకటిస్తామన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు హాజరు కావాలని కోరారు.

కార్పొరేషన్‌గా మంచిర్యాల



మున్సిపల్ కార్పొరేషన్ మ్యాప్

- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- నస్పూర్ మున్సిపాలిటీ సహా 6 గ్రామాలు విలీనం
- ఫలించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కృషి

మంచిర్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఆర్ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 19న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అసెంబ్లీలో మంచిర్యాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలతోపాటు హాజీపూర్ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ మంచిర్యాల కేంద్రంగా కార్పొరేషన్ ఏర్పాటుకు కలెక్టర్ కుమార్ దీపక్ మూడు నెలల క్రితం ప్రతిపాదనలు పంపారు. దీనిపై స్పందించిన సీడీఎంఏ కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన పూర్తి వివరాలు పంపాలని ఆదేశిస్తూ క్రితం మున్సిపల్ అధికారులకు లేఖ రాసింది. ఈ మేరకు రెండు మున్సిపాలిటీలు, ఆరు గ్రామాల్లో జనాభా, ఓటర్లు, కుటుంబాలు, ఆదాయ వనరులు, తదితర అంశాలపై అధికారులు సర్వే ప్రారంభించారు. సర్వే నివేదిక ప్రభుత్వానికి అందడంతో కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది.

జనాభా ప్రాతిపదికన..

జనాభా ప్రాతిపదికన మంచిర్యాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నస్పూర్ మున్సిపాలిటీతోపాటు హాజీపూర్ మండలంలోని వేంపల్లి, కొత్తపల్లి, పోచంపాడ్, ముల్కల్ల, గుడిపేట, చందనాపూర్, నర్సింగాపూర్, నంనూర్ గ్రామాల ను విలీనం చేస్తూ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు గెజిట్‌లో పేర్కొంది. మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటే జీవో నెంబర్ 571 ప్రకారం 2.5 నుంచి 3 లక్షల జనాభా అవసరం ఉంటుంది. ఈ విషయంలో కొంచెం అటుఇటుగా ఉన్నా కార్పొరేషన్ చేసే అవకాశాలు ఉన్నట్లు జీవో చెబుతోంది. అలాగే 2011 జనాభా లెక్కల ప్రకారం మంచిర్యాల మున్సిపాలిటీలో 36 వార్డులకుగాను 87,153 మంది జనాభా ఉండగా, నస్పూర్‌లో మున్సిపాలిటీలో 25 వార్డులకు 76,641, అయితే 2021లో అధికారుల గణాంకాల ప్రకారం మంచిర్యాల మున్సిపాలి టీలో లక్షా 50వేలు, నస్పూర్‌లో 91,427, జనాభా ఉంది. అలాగే విలీన గ్రామాల్లో కనీసం 13వేల జనాభా వరకు ఉంటుందని అంచనా. 2022 ప్రకారం చూస్తే రెండు మున్సిపాలిటీలు, విలీన గ్రామాల్లో మొత్తం జనాభా 2,54,000 మంది ఉన్నారు.

మిగతా 7వ పేజీలో..



కుహు..కుహూ.. సరాగాలు..

- బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ని ప్రారంభించిన సబ్ కలెక్టర్, ఏఎస్పీ, ఎఫ్‌డీవో
- 15రకాల విదేశీ పక్షుల సందడి

6

బహుముఖ ప్రజ్ఞాశాలి

7

- ధూంధాం కళాకారుడు, చిత్రలేఖనంలో మేటి
- ధాన్యం గింజలపై జాతీయ నాయకుల చిత్రాలు


నంది అవార్డు అందుకుంటున్న రాజేందర్

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి

- అఖిలపక్ష పార్టీల నాయకుల డిమాండ్


మాట్లాడుతున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

మందమర్రి టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు అందుగుల శ్రీనివాస్, కొంగల తిరుపతిరెడ్డి, రాయబారపు వెంకన్నలు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఎన్నికలు లేకపోవడం వల్ల ప్రజలు నష్టపోతున్నారని, సంక్షేమం కుంటు పడుతుందన్నారు. 1950 చట్టం ప్రకారం అప్పటి సరిహద్దులు విలేజ్ రామకృష్ణాపూర్, ఊరు మందమర్రిని పక్కన పెట్టి ఎన్నికలు నిర్వహించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎన్నికలు లేకపోవడం వల్ల అధికారుల జవాబుదారితనం లోపించిందని అన్నారు. దశాబ్దన్నర కాలంగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఎన్నికలే ఎజెండగా అఖిల పక్ష కార్యాచరణ ఉంటుందని, సమావేశాలు ఏర్పాటు చేసి పరిస్థితిని వివరించనున్నట్లు తెలిపారు. నాయకులు మేడిపల్లి సంపత్, ఒ. రాజశేఖర్, బండారి సూరిబాబు, మద్ది శంకర్, రాజశేఖర్, మాయ రమేష్, ముల్కల్ల ప్రసాద్, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలో ఉన్న ప్రభుత్వ భూమి స్వాధీనం

తాండూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అచ్చలాపూర్ శివారులో సర్వే నెంబరు 912లో 13 ఎకరాల భూమిని 21 ఫిబ్రవరి 2021లో అప్పటి కలెక్టర్ భారతి హోళికేరీ అటవీ శాఖకు కేటాయించారు. భూమిని కొందరు కబ్జా చేసి మామిడి తోట వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల రెవెన్యూ, ఆర్అండ్‌బీ, అటవీ, పోలీసు శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్ ప్రసాద్ భూమిని స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి


ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మందమర్రి టౌన్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి పెద్దపల్లి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సంజయ్ కుమార్, పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్‌లు పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ పేదల ఆకలిని తీర్చేందుకు రెం డు రూపాయల కిలో బియ్యం ప్రవేశపెట్టారన్నారు. జయ, అపర్ణ, జ్యోతి, నర్సయ్య, శ్రీనివాస్, ఒడ్నాల సత్యనారాయణ, రాజేష్, కనకయ్య పాల్గొన్నారు.మనోవికాస్ దివ్యాంగుల పాఠశాలలో పండ్లు, బ్రెడ్ అందజేశారు.

మంచిర్యాల కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలో కమ్మ సేవా సమితి నాయకులు ఎన్టీఆర్ వర్ధంతి నిర్వహించారు. లక్ష్మీటాకీస్ చౌరస్తాలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్డి కాలనీలోని కమ్మ సేవా సమితి కార్యాయలంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మంది పాల్గొని రక్తదానం చేశారు. గాజుల ముకేష్‌గౌడ్, వినయ్‌కుమార్, విష్ణువర్ధన్‌రావు, వెంకటేశ్వర్, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, సుధీర్, పాల్గొన్నారు.

బెల్లంపల్లి, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలో టీడీపీ అనుబంధ కార్మిక సంఘం టీఎన్‌టీయూసీ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి తారక రామారావు వర్ధంతి నిర్వహించారు. మణిరాంసింగ్, మల్లయ్య, రమేష్, గంగాధర్‌గౌడ్, రాములు, సుబాన్, పోచమల్లు, కనకయ్య, పాల్గొన్నారు.

శ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): ఎన్టీరామారావు తెలుగు ప్రజలకు స్ఫూర్తి ప్రదాత అని టీడీపీ పెద్దపల్లి పార్లమెంట్ మాజీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు అన్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గరిగంటి రాజయ్య, ఆవుల సుధాకర్, మొండయ్య, పెంటయ్య, మల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాండూర్, (ఆంధ్రజ్యోతి): దివంగత ఎన్‌టీ రామారావు వర్ధంతిని తాండూర్ లో ఘనంగా నిర్వహించారు. మండల ఇన్‌చార్జీ శ్రీనివాస్ ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొండి గౌడ్, ప్రకాష్, రాజేశం, రాజేష్‌పయిమ్, రమేష్‌గౌడ్, పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

గర్మిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5వ వార్డులో వెంకటేశ్వర ఆలయం ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ను శనివారం కౌన్సిలర్ సుదమల్ల హరికృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రజలందరు ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చోరీల నియంత్రణకు... డోర్ అలారమ్ తాళాలను వినియోగించండి

యాంటీ తెఫ్ట్ అలారం సిస్టంపై వివరించిన సీపీ

మంచిర్యాల క్రైం, జనవరి 18 (ఆంధ్ర జ్యోతి): యాంటీ తెఫ్ట్ అలారం వినియోగిం చడం ద్వారా దొంగతనాలను నివారించవ చ్చని రామగుండం సీపీ శ్రీనివాస్ అన్నారు. పోలీసు కమిషనర్ కార్యాలయంలో శనివారం నేరాల నియంత్రణలో సాంకేతిక వినియోగం అంశంపై సమావేశం నిర్వహించారు. ఆయ న మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఇండ్లలో దొంగతనాలు పెరిగాయన్నారు. దీని కోసం యాంటీ తెఫ్ట్ లాక్‌లను వినియోగించడం ద్వారా చోరీలను అదుపు చేయవచ్చన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటు లో ఉందన్నారు. నిత్య జీవితంలో టెక్నాలజీ ఒక భాగమైందన్నారు. సైరన్ అలారంలు బిగించడం వల్ల ఇంట్లోకి ఎవరైనా చొరబడటానికి ప్రయత్నిం చినప్పుడు అలారం శబ్దంతో చుట్టుపక్కల వారిని కూడా అలర్ట్ చేయడంతో దొంగలు పారిపోయే అవకాశం ఉందన్నారు. వచ్చిన వ్యక్తి భయపడి తన ప్రయత్నం విరమించుకుంటాడన్నారు.

ముఖ్యంగా గిడ్డంగులు, కర్మాగారాలు వంటి పారిశ్రామిక ప్రాంతాలు గోదాంలు, దుకాణాలు, రెస్టారెంట్లలో వాణిజ్య ప్రాంగణాల్లో ఇలాంటి అలారంలను ప్రతీ ఒక్కరు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీని వినియోగం యూట్యూబ్‌లో వీడియోలు చూసి తెలుసుకోవచ్చన్నారు. ఇవి 105 నుంచి 110 డీబీ శబ్దంతో మోగుతుందన్నారు. వీటి ఖరీదు రూ.300 నుంచి రూ.500 వరకు ఉంటుందన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ రాఘవేందర్‌రావు పాల్గొన్నారు.


యాంటీతెఫ్ట్ అలారం పనితీరు వివరిస్తున్న సీపీ

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని ఏసీసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాల్, ఏఈ శ్రావణ్ కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్‌ఏరియా, ఇక్బాల్‌నగర్, ఇందిరానగర్, జాఫర్ నగర్, జన్మభూమినగర్, హైటెక్ సిటీ, గ్రీన్ సిటీ, ఏసీసీ ఏరియా, శ్రీనివాసగార్డెన్, సావిత్రినగర్, గౌతమినగర్, ఇస్లాంపుర, రాళ్లపేట్, డీసీపీ ఆఫీస్ ప్రాంతాల్లో కరెంటు ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

సింగరేణి అధికారుల బదిలీలు

శ్రీరాంపూర్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పలువురు అధికారుల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే 5 గనిలో డిప్యూటీ ఎస్ఈ (ఎస్ఎంఎంసీ)గా పనిచేస్తున్న వేణుగోపాల్ శ్రీరాంపూర్ ఓసీపీకి బదిలీ అయ్యారు. అలాగే రామకృష్ణాపూర్ ఓసీపీలో మేనేజర్‌గా పనిచేస్తున్న సుధీర్ ఆర్‌జీ-1 ఏరియా క్వాలిటీ మేనేజర్‌గా, ఆర్‌జీ-1 క్వాలిటీ మేనేజర్‌గా పనిచేస్తున్న సాయి ప్రసాద్ ఆర్‌జీ-1 ఏరియా రక్షణాధి కారిగా, కార్పొరేట్ సీపీఅండ్‌పీ విభాగంలో అదనపు మేనేజర్‌గా పనిచేస్తున్న షేక్ మిన్హా జుద్దీన్ కార్పొరేట్ సేఫ్టీ విభాగానికి, కేటీకే 5లో జీఎంఈగా పనిచేస్తున్న శ్రీనివాసబాబు పీవీకే-5కి, పీవీకే-5లో అండర్ మేనేజర్‌గా పని చేస్తున్న వెంకట సురేష్‌బాబు వీకే ఓసీపీకి, పీవీకే-5లో ఎంటీ(మైనింగ్)గా పని చేస్తున్న మనోజ్ కుమార్ వీకే ఓసీపీకి బదిలీ అయ్యారు. వీరంతా తమ, తమ ఏరియా ఉన్నతాధికారులకు రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గోదావరి తీరంలో ఇసుకను తోడేస్తున్నారు..!


దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి నదిలో ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న కూలీలు

- తెప్పలతో తీసుక వచ్చి ఒడ్డుకు
- కాసులు కురిపిస్తున్న ఇసుక దందా
- గుడిరేవులో భారీగా ఇసుక డంప్


దండేపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరం నుంచి రాత్రి,పగలు తేడా లేకుండా ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. గుడిరేవు గోదావరి నుంచి నిత్యం ట్రాక్టర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నదిలో కొద్దిగా నీరు ఉన్న చోట ఇసుకను తోడి తెప్పల మీద తీసుకవస్తూ ఒడ్డుపై పోసి ట్రాక్టర్లలో నింపుకొని తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. గుడిరేవు గ్రామ సమీపంతో పాటు వివిధ గ్రామాల్లో డంప్ చేస్తున్నారు. గోదావరి నదిలో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి అక్రమంగా తరలిస్తున్న ఇసుక పట్టుకోవాలని, నదిలో తవ్వకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమతులు లేకుండా తరలిస్తే చర్యలు

సంధ్యారాణి, తహసీల్దార్

గోదావరి తీరాల నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటాం. ప్రభుత్వ నిబంధనలను పాటించని వారిపై చర్యలు తప్పవు. ఎవరైనా ఇంటి అవసరాలకు ఇసుక అవసరం ఉంటే అనుమతి తీసుకోవాలి. ఎలాంటి అనుమతి లేకుండ తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం.


ఇసుక నింపుకొని లోడ్‌తో ట్రాక్టర్లు


రహస్య ప్రదేశంలో భారీగా ఇసుక కుప్ప నిల్వలు


గోదావరి నది వద్ద పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

అక్రమంగా ఇసుక, మట్టి తరలింపు

గర్మిళ్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గోదావరి నదిలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నేతృత్వంలో ఇసుక, మట్టిని తరలించి దండుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శనివారం గోదావరి నదిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గోదావరి నది నుంచి అక్రమంగా ఇసుక, మట్టి తరలుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గోదావరిలో ఇసుక, మట్టి తీయడం వల్ల వర్షాకాలంలో గోదావరి నీరు వచ్చిన తర్వాత ప్రజలకు ఈ అక్రమ తవ్వకాల వల్ల ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. మంచిర్యాల గోదావరిలో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

చెన్నూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. శనివారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణం గతంలో ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. పదేళ్ల క్రితం తాను ఎంపీగా ఉన్న సమయంలో పట్టణం ఎలా ఉండేదో ఇప్పుడు అలానే ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి కాలనీలను సందర్శించి సమస్యలకు ప్రతిపాదనలను తయారు చేస్తున్నానన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులతో కాలనీల్లో అభివృద్ధి పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయన్నారు. పట్టణ అభివృద్ధికి మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీతో మాట్లాడి ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారికి రేషన్ కార్డు వస్తుందన్నారు. అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు ఇప్పిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

నేడు సమీక్ష సమావేశం

మందమర్రి టౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరగనుంది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరు కానున్నారు. ఇందులో అభివృద్ధి పను లపై చర్చించనున్నారు. అమృత్ స్కీం కింద మందమర్రి, క్యాతన్‌పల్లిలలో చేపట్టిన నీటి పథకం పనుల గురించి ఆరా తీయనున్నారు.

అలాగే మందమర్రిలో విద్యా వ్యాప్తికి కృషి చేసిన విద్యా విహార్ విద్యా సంస్థ నిర్వాహకుడు దివంగత షౌకత్ అలీ పేరిట రామన్ కాలనీ వద్ద లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరుకానున్నారు.

లక్ష్మి వెంకటేశ్వర హోమ్‌వరల్డ్ ప్రారంభం


షాపును ప్రారంభిస్తున్న పెద్దపెల్లి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షురాలు

మంచిర్యాల క్రైం, జనవరి 18(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన లక్ష్మివెంకటేశ్వర హోమ్‌వరల్డ్‌ను శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖప్రేంసాగర్‌రావు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, సత్యనారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, కౌన్సిలర్లు, నాయకులు, షాపు యజమాని భాస్కర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కిరణ్‌కుమారి


బాధ్యతలు చేపడుతున్న కిరణ్‌కుమారి

బెల్లంపల్లి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ కిరణ్‌కుమారి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందేలా కృషి చేస్తానన్నారు. సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. వైద్యులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.